క్లుప్తంగా

సింహగిరిపై నేటి నుంచి శరన్నవరాత్రి పూజలు

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృ సింహస్వామి ఆలయంలో శుక్రవారం నుంచి శరన్నవరాత్రి పూజలను విశేషంగా నిర్వహించ నున్నట్లు దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజ గోపాల్ గురువారం తెలిపారు. రోజూ ఉదయం రామాయణ పారాయణం ఉంటుందన్నారు. సాయంత్రం 5 గంటల నుంచి చతుర్భుజ తాయారు, సువర్ణ అమ్మవార్లకు ఆలయ బేడా మండపంలో తిరువీధి మహోత్సవం, విశేష పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

సీఐ చొరవతో గోతుల పూడ్చివేత



లంకెలపాలెం రోడ్డులో గోతులు పూడ్చుతున్న దృశ్యం

పరవాడ: పరవాడ–లంకెలపాలెం రహదారిలో సింహాద్రి జంక్షన్ సమీపంలో ఇటీవల కురిసిన వర్షాలకు ఏర్పడిన గోతులను పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు దగ్గరుండి మరీపూడ్పించారు. రహదారిలో ఏర్పడిన భారీ గోతుల కారణంగా నిత్యం ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్న విషయాన్ని గుర్తించిన ఆయన సమస్యను రాంకీ యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేశారు. గోతులు పూడ్చడానికి చొరవ చూపిన సీఐను స్థానికులు, ప్రయాణికులు అభినందించారు.

రోబోటిక్స్‌లో శ్రీమహిత్‌రాజ్ ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న పాఠశాల ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి

పరవాడ: మండలంలోనిపి.బోనంగి సంస్కృతి గ్లోబల్ స్కూల్లో 9వ తరగతి చదువుతున్న కె.శ్రీ మహిత్‌రాజ్ రోబోటిక్స్ అండ్ టెక్నాలజీలో విశేష ప్రతిభ కనబర్చాడు. న్యూఢిల్లీలో ఇంటర్నేషనల్ కాన్వకేషన్–2024 ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన రోబోటిక్స్ అండ్ టెక్నాలజీలో జాతీయ రికార్డును కైవసం చేసుకున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్.సీతాలక్ష్మి గురువారం మీడియాకు తెలిపారు. ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ జూలియా(వియత్నాం) చేతుల మీదుగా అవార్డును అందుకున్నట్లు పేర్కొన్నారు. విశేష ప్రతిభ కనబర్చిన శ్రీమహిత్‌రాజ్‌ను పాఠశాల సీఈవో కె.నిశాంత్, కోఆర్డినేటర్ రామలక్ష్మి, ఉపాధ్యాయులు అభినందించారు.

'ఫార్మా కార్మికులకు బోనస్ చెల్లించాలి'



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

పరవాడ: జేఎన్ ఫార్మాసిటీలోకార్మికులందరికీ సెప్టెంబర్ నెల జీతంతోపాటు 20 శాతం దసరా బోనస్ కలిపి చెల్లించాలని ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఫార్మాసిటీలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గోడపత్రికను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లాభాలు సాధిస్తున్న ఫార్మా యాజమాన్యాలు పెరుగుతున్న నిత్యావసరాల ధరలను దృష్టిలో ఉంచుకుని కార్మికులకు బోనస్ చెల్లించాలన్నారు. 20 మంది కంటే ఎక్కువ కార్మికులున్న అన్ని పరిశ్రమల్లో 1965 బోనస్ చట్టం ప్రకారం బోనస్ చెల్లించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకులు ఆర్.లక్ష్మణరావు, కె.శ్రీను, ఎస్.రామకృష్ణ, వై.నాగేశ్వరావు, ఆర్.రాజు, తులసీరావు పాల్గొన్నారు.

44 మద్యం సీసాల స్వాధీనం

పరవాడ: ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి మద్యం బాటిళ్లను తరలిస్తూ ఓ మహిళ పరవాడ పోలీసులకు చిక్కింది. పరవాడ గ్రామానికి చెందిన సీహెచ్ దేవి అనే మహిళ 44 క్వార్టర్ బాటిళ్లను తరలిస్తుండగా పోలీసులు గురువారం పట్టుకున్నారు. మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు సీఐ ఆర్.మల్లికార్జునరావు మీడియాకు తెలిపారు. వీటి విలువ రూ.6,858 ఉంటుందన్నారు.



సుజాతనగర్‌లో బాలాత్రిపుర సుందరిదేవిగా కనకదుర్గమ్మ



పెందుర్తి మహాకామేశ్వరీ ఆలయంలో అమ్మవారు



శ్రమశక్తినగర్‌లో మహాగాయత్రిగా పంచముఖ గాయత్రీదేవి




సప్తగిరినగర్‌లో ఆదిలక్ష్మిగా అలివేలు మంగమ్మ



స్వర్ణ కవచాలంకరణలో ఎస్ఆర్‌పురం దుర్గమ్మ



కోట్నివానిపాలెంలో కొలువుదీరిన దుర్గమ్మ



బాలాత్రిపురసుందరిగా దర్శనమిచ్చిన దుర్గమ్మ



ఎస్ఎల్‌బీ నగర్, బాలాజీ గార్డెన్స్‌లో కొలువైన అమ్మవారు

స్వర్ణకవచాలంకృత ధారిణీ నమోస్తుతే

- వైభవంగా మొదలైన దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు
- ఊరూవాడా అమ్మవారి ఆలయాల్లో భక్తుల కిటకిట
- మండపాల్లో కొలువుదీరిన దుర్గమ్మ

దుష్టుడైన మహిషాసురుడ్ని, అతడి సంతతిని సంహరించేందుకు అమ్మవారు తొమ్మిది అవతారాలు ధరించారని పురాణ ప్రతీతి. చెడుపై మంచి సాధించిన విజయానికి సంకేతంగా దసరా ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించడం సంప్రదాయం. దుర్గమ్మను వివిధ రూపాలతో అందంగా అలంకరించి షోడశోపచారాలతో పూజిస్తారు. తొలిరోజైన గురువారం నియోజకవర్గంలోని పలు దేవాలయాలు, మండపాల్లో దుర్గమ్మ తల్లిని స్వర్ణ/రజత కవచ ధారిణిగా, గాయత్రీమాత, బాలాత్రిపుర సుందరి, ఆదిలక్ష్మి అవతారాల్లో అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు.

పెందుర్తి: శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఊరూవాడా మండపాల్లో దుర్గమ్మ కొలువుదీరింది. అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తొలిరోజు అమ్మవారు వివిధ అవతారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు.

- సుజాతనగర్ అయ్యప్పస్వామి దేవాలయ ప్రాంగణంలోని కనకదుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాలా త్రిపుర సుందరిదేవిగా అమ్మవారు దర్శనమిచ్చారు. ఆలయ ధర్మకర్త వాకా చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రసాద వితరణ చేశారు.
- చినముషిడివాడ పంచముఖ గాయత్రీమాత ఆలయంలో భారీ ఎత్తున కుంకుమార్చన నిర్వహించారు. ముందుగా అమ్మవారికి పంచామృతాభిషేకాలు చేశారు. రజత కవచాలంకారంలో మహాగాయత్రిగా అమ్మవారు పూజలందుకున్నారు.
- సప్తగిరినగర్ అలివేలు మంగమ్మ సన్నిధిలో అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి, భారీఎత్తున కుంకుమ పూజలు చేశారు. ఆదిలక్ష్మిగా భక్తులకు అమ్మవారు దర్శనమిచ్చారు.
- పెందుర్తి మహాకామేశ్వరీ ఆలయంలో అమ్మవారికి రజత కవచాలంకరణ చేశారు. తొలుత విశేష అర్చనలు చేసి, సామూహిక కుంకుమ పూజలు జరిపారు.
- ఎస్ఆర్ పురంలోని కనకదుర్గమ్మ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలకు అంకురార్పణ జరిగింది. స్వర్ణ కవచాలంకృత దుర్గాదేవిగా అమ్మవారు పూజలందుకున్నారు. ముందుగా ఆలయ ధర్మకర్త కాయిత ఎర్రిబాబు ఆధ్వర్యంలో 108 కలశాల ఊరేగింపుతో మహిళలు తరలివెళ్లి, పూజలు చేశారు.
- పెందుర్తి ప్రాంతంలో కొలువుదీరిన దుర్గాదేవిని వైఎస్సార్‌సీపీ నేత శరగడం చినఅప్పలనాయుడు దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు.
- రాంపురంలో కొలువుదీరిన దుర్గాదేవిని సర్పంచ్ అన్నంరెడ్డి శిరీష, ఎంపీటీసీ హిమబిందు, జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ రెడ్డి నారాయణరావు, భక్తులు దర్శించుకుని, పూజలు చేశారు.
- కోట్నివానిపాలెంలో దుర్గాదేవి సన్నిధిలో కుంకుమ పూజలు జరిపారు. పెందుర్తి, పాతూరు, చిన ముషిడివాడ, పురుషోత్తపురం, చింతలగ్రహారం, పెదగాడి, గొరపల్లి, సరిపల్లి, రాజయ్యపేట, వేపగుంట, నాయుడుతోట, సుజాతనగర్, కరకవానిపాలెం ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మండపాల్లో దుర్గమ్మ కొలువుదీరింది.



పెందుర్తిలో అమ్మవారిని దర్శించుకుంటున్న వైఎస్సార్‌సీపీ నేత శరగడం చినఅప్పలనాయుడు



గుల్లేపల్లిలో దుర్గమ్మను దర్శించుకుంటున్న గండి రవికుమార్



రాంపురంలో అమ్మవారిని దర్శించుకుంటున్న సర్పంచ్ అన్నంరెడ్డి శిరీష, రెడ్డి నారాయణరావు



సప్తగిరినగర్ అలివేలు మంగమ్మ సన్నిధిలో కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

సింహాచలం: దసరా ఉత్సవాల్లో భాగంగా అడవివరంలోని హవేళి ప్రాంగణంలో శ్రీ వరాహ లక్ష్మీనృసింహ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం నుంచి దుర్గా నవరాత్రి మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 9 గంటల నుంచి గణపతిపూజ, పుణ్యాహవచనం, పంచగవ్యప్రాసన, రుత్విక్‌వరణం, గోపూజలను విశేషంగా నిర్వహించారు. అనంతరం యాగశాలలో అంకురార్పణ పూజలు, మండపారాధన జరిపారు. అమ్మవారి విగ్రహాన్ని వేదికపై ప్రతిష్టించి పూజలు నిర్వహించారు. తొలిరోజు అమ్మవారు బాలాత్రిపుర సుందరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శుక్రవారం నుంచి 12వ తేదీ వరకు రోజూ ఉదయం శ్రీ చక్రార్చన, చండీహోమం జరపనున్నట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా రెండవరోజు శుక్రవారం అమ్మవారు గాయత్రిదేవిగా దర్శనమివ్వనున్నారు.

ఆయిల్‌మిల్ వద్ద..

అడవివరంలోని ఆయిల్‌మిల్ వద్ద శ్రీగణేష్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం అమ్మవారి విగ్రహప్రతిష్ట, కలశ ప్రతిష్ట వైభవంగా నిర్వహించారు. భక్తులు విశేషంగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. గణేష్ యువజన సేవా సంఘం అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

పరవాడ: మండలంలో దేవీ నవరాత్రుల మహోత్సవాల్లో భాగంగా పలు గ్రామాల్లో దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు ఘనంగా జరిగాయి.

- పరవాడ బొంకులదిబ్బ యూత్ ఆధ్వర్యంలో దుర్గాదేవి విగ్రహాన్ని స్థానిక ఎంపీపీ పైల వెంకట పద్మలక్ష్మి శ్రీనివాసరావు దంపతులు చేతుల మీదుగా ప్రతిష్ఠించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, ఉప సర్పంచ్ బి.రామారావు, నాయకులు రెడ్డి శ్రీనివాసరావు, చల్లా కనకారావు, పైల పోతినాయుడు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.
- స్థానిక సంతబయలు వద్ద వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు దంపతులు దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు రొంగలి అప్పలనాయుడు, గండి సత్యనారాయణ, శ్రీనివాసరావు, పి.జగదీష్, బానోత్ బలరామ్, పి.సన్యాసిరావు, గండి నమో, కూండ్రపు సోమునాయుడు పాల్గొన్నారు.
- తానాంలో ఆదర్శ మోటార్ ఓనర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సర్పంచ్ కన్నూరుదేవి వెంకటరమణ, మాజీ జెడ్పీటీసీ పైల జగన్నాథరావు చేతుల మీదుగా దుర్గమ్మ విగ్రహ ప్రతిష్ట జరిగింది. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పైల రామారావు, వర్రి వసంతరావు, అసోసియేషన్ అధ్యక్షుడు కూండ్రపు పరమేష్, వర్రి వెంకటరమణ పాల్గొన్నారు.



దేవీపురంలోని శాస్త్రీయ సంగీత కార్యక్రమంలో చిన్నారుల బృందం

సబ్బవరం: మండలంలోని గుల్లేపల్లి గ్రామంలో దుర్గా దేవి యూత్ కమిటీ ఆధ్వర్యంలో నెలకొల్పిన దుర్గమ్మను వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గండి రవికుమార్ దర్శించుకుని, ప్రత్యే క పూజలు చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులతో పాటు మహిళలు, పెద్దలు సత్కరించారు. ఆయన వెంట పార్టీ నాయకులు బండారు శ్రీను, పార్టీ మండల యువజన విభాగం అధ్యక్షుడు యడ్ల నాయుడు, ఐడీ బాబు, సిరపరపు వాసు, కమిటీ సభ్యులు ఉన్నారు.

వైభవంగా దేవీపురం దసరా బ్రహ్మోత్సవాలు



సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి ఆరాధన పీఠంలో దసరా బ్రహ్మోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం గోమాత పూజతో కార్యక్రమాన్ని ప్రారంభించి మహాకాళీ, మహాలక్ష్మి, సరస్వతి తదితర దేవతలను 28 కలశాలలో ఆవాహన చేసి, శ్రీమేరు మొదటి అంతస్తులో కలశ ప్రతిష్ట నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తికి పంచామృత స్నానం ఆచరింపజేసి మహాకాళిగా అలంకరణలు గావించి, షోడశోపచార పూజ, ఖడ్గమాల సహిత నవావరణ అర్చనలు జరిపారు. ఉత్సవాల్లో పాల్గొనేందుకు రూఖయ్య(యూకే), డేనియల్(సెర్బియా), తార(కెనడా) తదితరులు వచ్చారు. మధ్యాహ్నం అన్నసమారాధన జరిపారు. సాయంత్రం అమ్మవారి సన్నిధిలో కాళీ హోమం నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా విశాఖకు చెందిన కె.విజయశ్రీ శిష్యుల బృందం వయోలిన్, కర్ణాటక సంగీత కచేరీ విశేషంగా అలరించాయి.



బొంకులదిబ్బ వద్ద దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ఠలో ఎంపీపీ వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావు దంపతులు



హవేళి ప్రాంగణంలో బాలాత్రిపురసుందరి అలంకరణలో దుర్గమ్మ



ఆయిల్‌మిల్ వద్ద కొలువైన దుర్గమ్మను దర్శించుకుంటున్న భక్తులు



తానాంలో సర్పంచ్ కన్నూరి దేవీ వెంకటరమణ, మాజీ జెడ్పీటీసీ జగన్నాథరావు



సంతబయలులో దుర్గమ్మను దర్శించుకున్న మాజీ సర్పంచ్ రామునాయుడు దంపతులు

అల్లుకున్న నిర్లక్ష్యం

- విద్యుత్ స్తంభాలు కనిపించనంతగా చుట్టుకున్న పొదలు
- కరెంట్ వైర్లపై అల్లుకుంటున్న పిచ్చి మొక్కల తీగలు
- తరుచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం
- చోద్యం చూస్తున్న ఈపీడీసీఎల్ అధికారులు
- జంగిల్ క్లియరెన్స్‌కు మీనమేషాలు

విద్యుత్ సరఫరాలో నష్టాలు నివారించేందుకు కరెంట్ స్తంభాలు, వైర్ల చుట్టూ అల్లుకున్న తీగ మొక్కలు, పొదల్ని ఎప్పటికప్పుడు తొలగించాలి. వర్షాలు పడుతున్న సమయంలో తీగ మొక్కలకు విద్యుత్ సరఫరా జరిగి పశువుల ప్రాణాలకే ప్రమాదం వాటిల్లే పరిస్థితి. వర్షాకాలం వచ్చిందంటే చాటు.. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద జాగ్రత్తగా ఉండాలని, వాటిని తాకరాదంటూ హెచ్చరికలు జారీ చేసే విద్యుత్ శాఖ జంగిల్ క్లియరెన్స్‌లో మాత్రం పూర్తి నిర్లక్ష్యం వహిస్తోంది. వాటికి నిదర్శనమే సబ్బవరంలో పలు చోట్ల కరెంట్ తీగల్ని, స్తంభాల్ని అల్లుకున్న పొదలు, తీగమొక్కలు.

సబ్బవరం: మండలంలో తరుచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో అనధికార విద్యుత్ కోతలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. విద్యుత్ వినియోగం విపరీతంగా పెరగడం, దీనికి తోడు కాలం చెల్లిన విద్యుత్ లైన్లతో విద్యుత్ సరఫరాలో తరచూ సమస్యలు ఏర్పడుతున్నాయి. కోతలు లేని నిరంతర విద్యుత్ సరఫరా చేస్తామనే ఏపీఈపీడీసీఎల్ హామీలు.. అమలుకు చాలా దూరంగా ఉన్నాయని ప్రజలు ఆక్షేపిస్తున్నారు.

సరిపోదా.. శుక్రవారం

మండలంలోని సెక్షన్–1, సెక్షన్–2, సబ్బవరం, అంతకాపల్లి సబ్‌స్టేషన్ల నుంచి మండల పరిధిలోని గ్రామాలకు రెండు సెక్షన్లుగా విద్యుత్ సరఫరా జరుగుతుంది. ఈపీడీసీఎల్ సిబ్బంది ప్రతి శుక్రవారం ఈ సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్ లైన్ల నిర్వహణలో భాగంగా మరమ్మతులు, లైన్లు సరిచేయడం, కరెంట్ వైర్ల వరకు సాగిన తీగమొక్కల తొలగింపునకు జంగిల్ క్లియరెన్స్ తదితర పనులు చేపట్టేందుకు పగటిపూట విద్యుత్ సరఫరా నిలిపేస్తారు. చాలా వరకు ఉదయం నిలిపేసిన విద్యుత్ సరఫరా ఏ సాయంత్రానికో.. రాత్రికో మాత్రమే పునరుద్ధరిస్తారు. అయినప్పటికీ జంగిల్ క్లియరెన్స్ ప్రభావం ఎక్కడా కనిపించట్లేదు. వర్షాకాలంలో వీటి కారణంగానే తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది.

లో ఓల్టేజీ.. హై కరెంట్ కోతలు

మండలంలోని దాదాపు అన్ని గ్రామాల్లో విద్యుత్ లైన్లు చాలా వరకు అధ్వాన పరిస్థితిలో ఉన్నాయి. ఏళ్లనాటి ట్రాన్స్‌ఫార్మర్లకు తోడు పెరిగిన విద్యుత్ వాడకంతో లో ఓల్టేజీ సమస్య తీవ్రంగా వేధిస్తోంది. సబ్బవరం నుంచి ఆరిపాక వైపు విద్యుత్ లైన్ల పునరుద్ధరణకు స్థానికులు చాలాసార్లు అధికారులు, అందుబాటులో ఉన్న నాయకులతో మొరపెట్టుకున్నారు. అయినా అధికారుల్లో స్పందన కనిపించట్లేదని సంబంధిత గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అమృతపురం–నరవ వెళ్లే విద్యుత్ లైన్లపైకి ఎదిగిన చెట్ల కొమ్మలు, గొర్లివానిపాలెం కేజీబీవీ సమీపంలో స్తంభాలపైకి దట్టంగా వ్యాపించిన పొదలు, సబ్బవరం–గుల్లేపల్లి రోడ్డులోని కొత్తరోడ్డు సమీపంలో విద్యుత్ వైర్లు కనిపించకుండా అల్లుకున్న తీగమొక్కలతో కాస్త గాలి వీచినా, వర్షం కురిసినా విద్యుత్ కోతలు తప్పనిసరి. వేసవిలో కూడా చూడనంతగా గత కొన్ని రోజులుగా మండల పరిధిలో అప్రకటిత, అనధికార విద్యుత్ కోతలు విధిస్తున్నారు.



గుల్లేపల్లి దరి కొత్తరోడ్డు సమీపంలో హెచ్‌టీ వైర్ల పైకి పాకిన తీగలు



కేజీబీవీ సమీపంలో విద్యుత్ లైన్లు కనిపించకుండా అల్లుకున్న తీగలు



వంగలి రోడ్డులో విద్యుత్ స్తంభం పైకి ఎదిగిన పొదలు

ఎందుకు ఆపేస్తున్నారో తెలియట్లేదు



ఈ మధ్యన సబ్బవరం మేజర్ పంచాయతీ పరిధిలోని పాత సబ్బవరం పరిసర ప్రాంతాల్లో కరెంట్ ఆపేస్తున్నారు. వర్షం పడినపుడు కరెంట్ పోతే తిరిగి ఎప్పుడొస్తుందో కూడా తెలీదు. ప్రస్తుతం వేసవి స్థాయిలో ఎండలున్నాయి. విద్యుత్ సరఫరా మాత్రం సరిగా లేదు. ఎందుకు కరెంట్ పోతుందో.. ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి. చంటిపిల్లలు, వృద్ధులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకోవాలి.

– బండారు కిరణ్ కుమార్, పాత సబ్బవరం

తరచూ విద్యుత్ అంతరాయం



వర్షాకాలం కావడంతో తరుచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతోంది. ఒక్కోసారి రాత్రిపూట వర్షం కురిస్తే చెట్లు, చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలపై పడి తరచూ విద్యుత్ లైన్లు దెబ్బతింటున్నాయి. దీంతో ఇంట్లో ఉండే టీవీలు, ఫ్రిజ్‌లు, ఏసీలు వంటి విలువైన గృహోపకరణాలు కాలిపోతున్నాయి. మరోవైపు రాత్రంతా కరెంట్ వచ్చే పరిస్థితి ఉండట్లేదు. మెరుగైన విద్యుత్‌ను సరఫరా చేసే దిశగా ఈపీడీసీఎల్ అధికారులు చొరవ తీసుకోవాలి.

– ఇసరపు వెంకటరావు, రాయపుర అగ్రహారం

నిరంతర సరఫరాకు చర్యలు

మండల పరిధిలో నిరంతరం నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు ఈపీడీసీఎల్ చిత్తశుద్ధితో పనిచేస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో పలు చోట్ల లో ఓల్టేజ్ సమస్యను పరిష్కరించేందుకు కొత్త/అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. సబ్బవరం సబ్‌స్టేషన్ పరిధిలో ఫీడర్ల వారీగా విద్యుత్ లైన్ల మరమ్మతులు, విద్యుత్ స్తంభాలు, వైర్లపై అల్లుకున్న తీగలు, కొమ్మల్ని తొలగించేందుకు జంగిల్ క్లియరెన్స్ చేపడతాం. ఇందు కోసమే ప్రతి శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలిపి, నిర్వహణ, మరమ్మతులు పనులు చేపడుతున్నాం.

– అశోక్ కుమార్, ఏఈ, సబ్బవరం సెక్షన్–1

గుల్లేపల్లి పీహెచ్‌సీ అభివృద్ధికి కృషి



పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి తదితరులు

సబ్బవరం: మండలంలోని గుల్లేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ)లో పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్, ఎంపీపీ బోకం సూర్యకుమారి అధ్యక్షతన గురువారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో 2024–25 సంవత్సరానికి సంబంధించి పీహెచ్‌సీ అభివృద్ధికి ప్రభుత్వం విడుదల చేసిన నిధులపై చర్చించారు. నిధుల మేరకు ఆస్పత్రి అభివృద్ధి, నిర్వహణ పనులపై తీర్మానాలు చేశారు. కమిటీ సభ్యులు ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ శాంతి, బైలపూడి గౌరి, బండారు మంగ, యడ్ల నాయుడు, స్థానిక నాయకులు బోకం రామునాయుడు, బైలపూడి దేముడుబాబు, ఉప సర్పంచ్ గజ్జి దేముడుబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

భారీ గుంతలతో ప్రయాణికుల అవస్థలు



పరవాడ–వాడచీపురుపల్లి రహదారిలో ఎన్టీపీసీ వద్ద ఏర్పడిన భారీ గుంతలు

పరవాడ: వాడచీపురుపల్లి–పరవాడ రహదారిలో ఎన్టీపీసీ ఫోర్త్ యూనిట్ సమీపంలో ఏర్పడిన గోతులతో ప్రయాణికులు నరకయాతన పడుతున్నారు. భారీ వర్షాల కు ఎగువ ప్రాంతాల నుంచి వర్షపు నీరు రోడ్డు మీదుగా ప్రవహించడం వలన రోడ్డు కొట్టుకుపోయి గోతులు ఏర్పడ్డాయి. రోడ్డు మధ్యలో పడిన గుంతలను పూడ్చడానికి అధికారులు కనీస చర్యలు తీసుకోవట్లేదు. ఫలితంగా ఎన్టీపీసీ ఉద్యోగులు, కార్మికులు, వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు అవస్థలు పడుతున్నారు. రాత్రివేళ గోతులు కనిపించక వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు గోతుల్ని పూడ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.